# ఆత్మదృష్టి

ఆ నర్సింగ్‌హోమ్ చుట్టూ చెక్కర్లు కొడుతూ కొడుతూ 'ఆత్మ' ఒకటి అర్జంట్‌గా లాబ్‌లోకి దూరి అప్పుడే గాజు సీసాలో చేరిన రెండు కళ్ళని పలకరించింది.

"ఓ నేత్రద్వయమా ! సమయానికి కనిపించావు. చాలా విసుగ్గా వుంది. ఓ సారలా తిరిగి వద్దాం వస్తావా."

"ఇప్పుడేగా వచ్చాను. లోకాన్ని చూసి చూసి అలసిపోయాను. కాస్త విశ్రాంతి తీసుకోనిద్దూ." అన్నాయి కళ్ళు.

"ఫర్లేదులే. ఇప్పుడే వచ్చేద్దాం."

"ఎక్కడికని వెళ్దాం ?"

"ఇక్కడికేలే రా." అంది ఆత్మ.

"సరే పద" అంటూ రెండు కళ్ళూ ఒక చూపై ఆత్మ వెంట బయలుదేరింది.

ఇద్దరూ కలని 'ఇన్‌టెన్సివ్ కార్డియాక్ కేర్ యూనిట్' లోకి జొరబడ్డారు.

అక్కడ నాలుగు బెడ్స్‌మీద నలుగురు పేషెంట్లు పడుకుని వున్నారు. వారందరూ హృద్రోగ బాధితులే ఒక్కొక్కరికీ రకరకాల ప్లగ్గులు పెట్టి ఏవేవో మానిటర్ చేస్తూ, వారివారి హృదయస్పందనలు అక్కడే అమర్చిన స్క్రీన్‌లపై చూస్తున్నారు. ఛాతీమీద ఏవేవో బిళ్ళలు అతికించుకుని, కళ్ళలో భయం, ఒళ్ళంతా నీరసంతో పడుకుని వున్నారా నలుగురు రోగులు

ప్రతి గొప్ప వ్యక్తి వెనుకా ఒక స్త్రీ వుంటుందో వుండదోగానీ ప్రతీ హార్టు పేషెంటు పక్కనా ఒక దీన వదన కూర్చుని మాత్రం వుంది.

"వచ్చి వచ్చి ఇక్కడికి కొచ్చామేమిటి ?" అంది చూపు.

"ఉండూ, కంగారుపడకు. ఇక్కడున్న ఒక్కొక్కరి గురించీ నీకు చెప్తాను." అంది ఆత్మ.

"ఏం ? ఆ కథలంత బాగుంటాయేమిటి ?"

"బాగుండటమేమిటి బ్రహ్మాండంగా, ఇంట్రస్టింగ్‌గా వుంటాయి."

"అయితే చెప్పుచూద్దాం."

అదిగో - అక్కడ చూడు - పాపం, ఆ పెద్దమనిషి ఎంతో దీనంగా పడుకున్నాడు. చూశావా - ఆ జబ్బు లాగేస్తోందని ఓ బాధపడిపోతున్నాడు. ఆ భార్య వొత్తుతోంది.

"ఆ .... ఆ ... "

"ఆ మహానుభావుడు ఆ చెయ్యెత్తి భార్యని కొట్టనిరోజు లేదు."

"ఏం ? ఎందుకని ? ఆమె మంచిది కాదా ?"

"కాకపోవడం కాదు. భార్యని కొట్టని రోజున అతనికి నోటికి ముద్దెక్కేది కాదు."

"అదే .... కారణం ఏమిటీ అంటున్నా."

ఆమె తండ్రికి బోలెడు డబ్బుంది. ఒకతె కూతురు. అమాయకురాలు. మంచిది. భయస్తురాలు. కావలసిన బంధువులలో కుర్రాడుకదాని, డబ్బులులేక పోయినా ఈమె నిచ్చి పెళ్ళిచేసి అపురూపంగా చూసుకోవడం మొదలుపెట్టాడు. ఆ పిల్లతండ్రి అయితే ఆ భర్తకి ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్ - తనని అందరూ తక్కువగా చూస్తున్నారేమో, తను డబ్బుగల వాడ్నికానని లోకువ చేస్తున్నారేమోననే అనుమానం. దీనికి తోడు వాడికి లేని దుర్గుణమంటూ లేదు. రోజూ చేతికందిన డబ్బు తీసుకుపోయి, జల్సా చేయడం, ఎవరేనా ఏమైనా అడిగితే "అదిగో నేను పేదవాడ్ని కనుకనే నన్ను అవమానిస్తున్నారు. నేనే ధనవంతుడనైతే ఇలా అడిగే ధైర్యముంటుందా ? అసలు నా కెందుకిచ్చి పెళ్ళి చేశారు ? పైగా నా కేమిటీ అవమానం' అని నానా గొడవా చేసేవాడు. రోజూ రాత్రయేసరికి బాగా తాగి వచ్చి చావు దెబ్బలు కొట్టేవాడు. పాపం ఆ తండ్రి ఏం చెయ్యాలో తోచక ఎలా సమస్యని పరిష్కరించాలో తెలిక, ఆ పిల్ల పడుతున్న అవస్థ చూడలేక మంచానపడి తీసుకుని తీసుకుని పోయాడు.

"అయ్యో పాపం !"

"అప్పట్నించి ఆమె అవస్థలు మరీ అధ్వాన్నమయిపోయాయి. ఏళ్ళు గడిచాయి. కానీ ఎల్లకాలం ఒకలాగే వుండదు కదా! కొడుకు ఎదిగి వచ్చాడు. ఆ కుర్రాడు తల్లిపడే బాధలు చూడలేక తిరగబడ్డాడు.

"మా అమ్మ వంటి మీద చెయ్యి పడిందంటే చీరేస్తాను" అంటూ కలియబడేసరికి బి.పి. బాగా పెరిగి వొళ్ళంతా చెమటలుపోసి. యిదిగో యిలా హాస్పటల్లో చేరాడు.

"మరీ .... ఆ యిల్లాలలా శ్రద్ధగా సేవలు చేస్తోందే పాపం -"

"చేయకేం చేస్తుంది? భారతనారి కదా" అంది ఆత్మ వ్యంగ్యంగా.

"అన్యాయం కదూ" -

"ఏ చేతులతో తనని చావ చితక్కొట్టాడో ఆ చేతులులాగేస్తున్నా యంటే ఎంత సహనంగా ఒత్తుతోందో చూడు" -

"బాగుంది కథ"

"సరే వాడ్ని వదిలెయ్. ఆ పక్క మంచంమీద వున్నాడు చూడు. వాడు మరీ అన్యాయం. వాడి ఇ. సి. జి. ఎలా ఎగిరెగిరిపడుతుందో చూడు.

"అది సరే గానీ - ఆ పక్కనున్నామె అతని భార్యా?"

"అవును. ఏం? అయినా భార్య కాకపోతే ఎవరొచ్చి యిలా సేవలు చేస్తారు?

ఆ సంగతి కాదు నేననేది. ఎంత అందంగా వుంది? వయసు మళ్ళినా ఇంత బాగుందంటే మరి వయసులో వున్నప్పుడింకెంతందంగా వుండేదో ...." దృష్టి ఆశ్చర్యం వ్యక్తపరిచింది.

"ఆ అందమే ఆమె పాలిట శాపమైంది. వాడికి భరించలేనంత అనుమానం. నిజానికి వాడి మనసులో వున్న అనుమానమంతా మానిటర్ చెయ్యగల శక్తి ఏ యంత్రానికైనా వుంటే అదీపాటికి ఢామ్మని పగిలిపోయి వుండేది" -

కళ్ళు నవ్వాయి.

"అనుమానమా ఎందుకూ?"

"ఎందుకేమిటి అది వాడి బుద్ధి." చిరాకుపడింది ఆత్మ.

"వాడి బుద్ధికి బుద్ధి చెప్పాలిగా."

"ఆ .... ఏం చేస్తుంది? పాపం, ఆ పిల్ల పేదింటిది. చక్కనిపిల్ల కదాని మేము మా అబ్బాయికి చేసుకుంటాము" అన్నారా పిల్లాడి తల్లిదండ్రులు. పేద

తల్లిదండ్రులు ఆనందపడి, మురిసిపోయి, పిల్ల నిచ్చి పెళ్ళి చేశారు. ఇంక నరకం ప్రారంభమైంది.

వాడు రోజూ రాత్రిళ్ళ ఆమెని మాటలతో కుళ్ళబొడిచి, ఆమె మనసుని తునాతునకలు చేయడమే పని. ఒక్కరోజు కూడా ఆమె సుఖంగా, ఆనందంగా వుండి ఎరుగదు.

"వాడు నీకేసి చూశాడు— వీడెవడో ఇటువైపు ఎందుకొచ్చాడు ? ఆ మేడ మీద కుర్రాడు ఎప్పుడూ ఆ కిటికీ తెరిచే వుంచుకుంటాడెందుకు ? ఆ పక్కింటాయన పంపు దగ్గర కెళ్ళినపుడు నిన్నా ఛాయల కెళ్ళద్దని చెప్పానా ? అలా ఎప్పుడూ అద్దం ముందు తగలడకపోతే వేరే పని చూసుకోకూడదూ."

ఇలా అనుక్షణమూ ఆమెని ఛీత్కరించటమేగానీ ఎప్పుడూ ప్రేమగా మాట్లాడి ఎరుగడు.

"అలాంటి వాడ్ని వదిలేసి పోవచ్చుగా" అంది దృష్టి.

"అంత సులువుగా జరిగే పని కాదది. తల్లిదండ్రులు పేదవాళ్ళ - భయస్థులు - ఇంకా పిల్లలున్నవాళ్ళు. వాళ్ళు ఆమె కెప్పుడూ "ఓర్చుకోమ్మా ! నెమ్మదిగా అన్నీ సర్దుకుంటాయి, మనుషులు మారుతారు. మంచిరోజులు వస్తాయి ? తొందరపడితే నలుగురిలో తలెత్తుకోలేం. నీ చెల్లాయిల్ని గురించి ఆలోచించైనా సర్దుకోమ్మా" అంటూ చెప్పి, ఎప్పటికప్పుడు సముదాయిస్తూ వచ్చారు.

"అంత హృదయం లేనివాడికి గుండెపోటెలా వచ్చింది." అంది దృష్టి.

"భలే జోక్ వేశావు. వాడికి గుండె వుంది అందులో వుండవలసిన ఇంగితజ్ఞానం లేదు. ఒక్క అనుమానభూతం మాత్రమే వుంది" ఆత్మ అంది.

ఇంతకీ ఏమైంది ? ఇక్కడ చేర్పించారెందుకు ?"

ఆ .... ఏముంది ? ఆఫీసులో ఏదో గొడవ పడ్డాట్ట. బాగా అరిచాట్ట, నలుగురూ నాలుగు మాటలన్నారు. ఒకరిద్దరు తన్నడానికి వచ్చార్ట. మొత్తానికి హై బీ. పి. వచ్చి ఇక్కడికొచ్చి పడ్డాడు.

"కానీ ఆమె మాత్రం ఎంత దీనంగా అక్కడ కూర్చుని సేవలు చేస్తోంది ? పాత సినిమాలోని కాంచనమాలలా ఎంత అందంగా వుందో" దృష్టి తన్మయంగా అంది.

"ఏమిటి ఎప్పుడూ ఆమె అందాన్ని పొగడటంతో సరిపోతోంది నీకు. చూడబోతే నీది మగాడి దృష్టిలా వుంది. మగాడి ముఖం నుండి ఊడిపడ్డ కళ్ళా ఏమిటి ? అంది ఆత్మ అనుమానంగా.

"ఉన్న విషయం చెప్పడానికి మగేమిటి ? ఆడేమిటి ? ఇంతకీ మూడో కథ లోకి రా" అంది దృష్టి చిన్నబుచ్చుకుని.

మూడో బెడ్డుమీద వాడికి చిన్నగా ఎటాక్కొ వచ్చింది. వాడికి రావాల్సిందే-కనిగా అంది ఆత్మ.

"ఏం ? ఎందుకంత కసి ?"

"చెప్తాను విను. ఆమెకి పిల్లలు పుట్టలేదు. వాడు యాభయ్యోపడిలో పడ బోతున్నాడు. పిల్లలు లేరని మళ్ళీ ఓ కుర్రదాన్ని పెళ్ళాడుతానని ఇంట్లో రభస. పిల్లలు లేరన్న బాధకంటే నలుగురిలో ఈ అవమానం సహించరానిదిగా తయారైందామెకి. పోనీ ఎవర్నయినా పెంచుకుందామంటే, కాదు కాదు పెళ్ళే చేసుకుంటానని తయారయ్యాడు. మన సమాజంలో ఇలాంటివి వ్యతిరేకించటానికి బదులు సమర్థించేవారూ వున్నారు. అందుకే ఓ తల్లిదండ్రులు పిల్లనివ్వ వచ్చారు. మళ్ళీ నిన్న ఇంట్లో పెద్ద గొడవే జరిగింది. భార్య ఫేనుకి ఉరేసుకోబోయింది. వీడికి బి పి. బాగా పెరిగి గుండెపోటు వచ్చింది. ఇక్కడికి తీసుకొచ్చారు. దెబ్బతో పెళ్ళిగిళ్ళీ కొండెక్కాయి. పాపం, ఆ భార్య మూడు ఎంత శ్రద్ధగా సేవచేస్తోందో ! నిజానికి ఆమెకి కూడా మూడు రాత్రులుగా నిద్రలేదు. తిండిలేదు. అయినా ఆమెకి తప్పదుగా - బాధ్యతగా చేస్తోంది."

అప్పుడు దృష్టి మరింత శ్రద్ధగా ఆత్మ వైపు చూసి "చూడబోతే నువ్వు ఆడ ఆత్మలా వున్నావే. మగాళ్ళని దుయ్యబట్టడమే పనిలా వుంది నీకు" అంది.

"ఇందాక నువ్వు చెప్పావుగా వున్న విషయం చెప్పటానికి మగేమిటి, ఆడేమిటీ అని-" అంటూ దీర్ఘం తీసింది.

ఇకపోతే నాలుగో మంచం మీదున్నవాడు నిజంగా మంచివాడు. వాడికి అన్యాయంగా వచ్చింది హార్టెటాక్.

"అదేమిటి ? గుండెపోటు రావడానికి న్యాయాన్యాయాలుంటాయా?"

ఉండాలి. కానీ వుండవు. ఏం చేస్తాం ?

ఇతని కథ కాస్త చిత్రమైనదే. ఇతనికి నలుగురు చెల్లెళ్ళు. తండ్రి అకస్మాత్తుగా చనిపోయాడు. అప్పటికే ఇద్దరు చెల్లెళ్ళు పెళ్ళికి సిద్ధంగా వున్నారు. ఇతని దగ్గర పెద్దగా డబ్బులేదు. అయినప్పటికీ నలుగురి చెల్లెళ్ళకి పెళ్ళిళ్ళు చేసిగాసీ తను పెళ్ళి చేసుకోనని భీషణ ప్రతిజ్ఞ చేశాడు. పెళ్ళికొడుకుల వేటలో డబ్బు, సమయం ఖర్చు చేశాడు. ఉన్నవన్నీ అమ్మి కట్న కానుకల కోసం సిద్ధపరిచాడు. వయసు మించిపోతుండగా ఒక్కొక్క చెల్లికీ పెళ్ళి చేసేసరికి అతనికి నలభైదాటి

పోయాయి. పదిహేను రోజుల క్రితమే ఆఖరి చెల్లెలు, పాతికేళ్ళ పిల్లకి పెళ్ళి చేశాడు.

"మరి అంతా బాగుంది కదా! మరీ ఎటాక్ ఏమిటి ?" —

పెద్ద చెల్లెలి మొగుడు లారీ ఏక్సిడెంట్‌లో చనిపోయాడు. నిన్ననే ఆ వార్త యితనికి అందింది. ఆ కబురు వినగానే యితనికిలాగైంది.

"అయ్యోపాపం! అయితే ఇతను మంచివాడేనన్నమాట."

''పెళ్ళికానంతవరకు ప్రతి మగాడూ మంచివాడే'' అంది ఆత్మ చమత్కారంగా.

కళ్ళు నవ్వాయి.

త్వరలో మళ్ళీ నీకు జన్మ వస్తుంది. అప్పుడు మళ్ళీ ఆడజన్మ ఎత్తుతావా - లేక మగవాడిగా పుడతావా ?

''ఛీ! ఆడదై పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం నయం'' అంది ఆత్మ.

''ఇదిగో ఈ పిరికితనమే నా కసహ్యం. మీ కిలాంటి అవకాశవాదమూ పనికిరాదు. నువ్వు ధైర్యంగా ఆడ పుట్టుకే పుట్టి స్త్రీ అంటే ఏమిటో రుజువు చెయ్యాలి. అంతేగానీ పాత చింతకాయ పచ్చడి భావాలతో ఆడదీ అడవిలో మానూ అనడం సిగ్గుచేటు కదూ'' అంది దృష్టి. మరవి మగాడి కళ్ళుకదా అందుకని.-

ఆత్మ వులిక్కిపడింది. ఒకసారి ఆలోచనలో పడింది. అవును. నిజమే. ఈ కళ్ళు నిజమే చెప్పాయి. ఈ జన్మలో ఏవేవి సాధించలేక, భంగపడ్డానో అవన్నీ తిరిగి సాధించడానికి, ధైర్యంగా పోరాడటానికి తను స్త్రీగానే పుట్టాలి.

''నడు నడు - ఎవరికో నేత్రదానం కోసం వచ్చాను. టైమైనట్టుగా వుంది. వెళ్ళాలి.'' అన్నాయి కళ్ళు.

ఆత్మ నిబ్బరంగా దృష్టివైపు చూసి.

''నేను స్త్రీగానే పుడతాను. అప్పుడు నిన్ను కలుస్తాన్లే.''

''ఇప్పుడు నేను స్త్రీకి కళ్ళగా అమరబోతున్నా ఆ దృష్టితో లోకాన్ని చూడబోతున్నా. ఈ అవకాశం వచ్చినందుకు ఆనందంగా వుంది. ఆసక్తిగానూ వుంది'' అంది దృష్టి

ఆత్మా - కళ్ళూ కలిసి ఆ I. C. C. యూనిట్‌లోంచి బయట కొచ్చేశాయి.

4-5-94 — (రేడియో)